# అంటరానివాడు

ఆమె కాలు ఇంట్లో నిలవటం లేదు.

అలాగని వీధిలోకి వెళ్లడానికి మొగం చెల్లడం లేదు.

కాలుగాలిన పిల్లిలా ఇల్లంతా తిరుగుతూ ఉంది.

తిరిగి తిరిగి ఇక తిరగలేక అలానే సోఫాలో కుప్పలా కూలబడింది. ఆ సోఫా వేలాది గులాబుల్ని ఒకదానిపై ఒకటి పేర్చినట్టు ఎంతో మృదువుగా, మెత్తగా ఉన్నా క్షణాల్లోముళ్ల పాన్పులామారింది. ఆ ముళ్ల పాన్పుమీద కూర్చోలేక చివాలున పైకి లేస్తుంది. లేచి తిరుగుతుంది. తిరగలేక ఎక్కడో ఒకచోట కుప్పలా కూలబడుతూ ఉంది.

కూర్చున్నా లేచినా తిరుతున్నా గుండెల్లో బరువు. మోయలేనంత బరువు. పిడికెడంత గుండె. ఆబరువు కింద బండకింద పడిన ఎలుకలా నలిగిపోతుందేమో నన్న భయం. భయం భయంగా గుండెను తడిమి చూసుకొంటుంది. అది కొట్టుకుంటూ ఉంటుంది వేగంగా. అలా కొట్టుకొని కొట్టుకొని ఉన్నట్లుండి ఆగిపోతుందేమో అన్నంత వేగంగా... లయతప్పుతున్నట్లుగా!

అలా లయతప్పి ఆగిపోతే?

ఆ ఊహతోనే ఒళ్ళంతా చెమట పట్టింది. లోపల వేడి. పెదాలు తడారిపోయాయి. కనుకొలుకుల్లో నీళ్ళు. కడుపులో గంపెడు అగ్గి పోసినట్టు మంట. లేవలేక లేస్తుంది. గుట గుట చెంబుడు నీళ్లు తాగుతుంది.

నీళ్లతో కన్నీళ్లతో చల్లారే మంట కాదది. పెదాలు తడారిపోతూనే ఉన్నాయి. గుండె మరింత వేగంగా కొట్టుకొంటూనే ఉంది. ఒళ్ళు సల సల కాగిపోతూ ఉంది. నడుములు విరిగిపోతున్నాయి.

ఇంతకూ ఆమాట తన చెవినిపడిందెప్పుడు? భల్లుమని తెల తెల వారుతున్నపుడు. అప్పుడు మూసిన తలుపులు. ఇల్లంతా చీకటి. ఆ చీకటిలో తాను. రెక్కలు రాని ఇద్దరు

పిల్లలు. అప్పటి నుండి ఇదే అవస్థ!

జంకుతూ జంకుతూ తలుపు కొద్దిగా తీసింది. వీధిలోకి తొంగి చూసింది.

పొద్దు బాగా వాటారింది. నీరెండ పడి ఇంటిముందర తారురోడ్డు నిగ నిగలాడుతూ ఉంది. ఆ తారురోడ్డు మీద జనం వస్తున్నారు. పోతున్నారు. కార్లు మోటార్లు లారీలు ఒకదానితో ఒకటి పోటీపడుతూ ముందుకు దూసుకొని పోతూ ఉన్నాయి. రోడ్డు కటువైపు టీ అంగళ్ల ముందు టీ తాగుతూ చచ్చు రాజకీయాలు వాగుతూ జనం. పాలకేన్లు భర్తీ చేసుకొంటూ డైరీ ఫారమ్ లారీ. ఒలికిన పాల చుక్కల్ని నాకుతూ కుక్కలు. అంతా మామూలుగా జరిగిపోతున్నట్లే ఉంది.

అయితే తాను మాత్రం ఉదయం నుండి చిత్రహింస అనుభవిస్తూనే ఉంది.

ఇంతకూ ఆమాట నమ్మాలా వద్దా?

పత్రికల్లో పడింది. ప్రతినోటా అదే మాట. నిద్ర కళ్లతో ఇంటిమీద పడి నిజమా అని అడిగింది ఎంతమంది? ఇక నమ్మాలా వద్దా అన్న ప్రశ్నకు తావెక్కడుంది?

తావు తన మనస్సులో ఉంది. అందుకే ఈ తపన.

ఆమె తలుపు మూసింది. గడి పెట్టింది. మెల్లగా పడక గదిలోకి నడిచింది. దీపం వెలిగించింది. సూట్‌కేస్ తెరిచింది. చీర మడతల్లో ఎప్పుడో దాచిపెట్టిన ఫోటో చేతికి తీసుకొనింది. పడకమీద కూర్చొనింది.

ఆ ఫోటో వైపు రెప్పార్చకుండా తదేకంగా చూస్తూ ఉంది. ఆ మొగంలో ఎంత ప్రసన్నత? ఆ కన్నుల్లో ఎంత అమాయకత? మరి గుండెల్లో మాత్రం ఇంత దుర్మార్గం గూడుకట్టుకొని ఉందా? అదే అదే నమ్మశక్యంకావడంలేదు. నమ్మకపోవడానికి కారణం? కేవలం ఆ మనిషిపై పెంచుకున్న అభిమానం. ఆ అభిమానంలో నుండి పుట్టిన అనురాగం.

అయితే జరిగింది మాత్రం వాస్తవం.

ఛీ!...ఇంత దుర్మార్గుడా ఈ మనిషి? చేతిలో ఫోటో ముక్కలు ముక్కలయింది. ఆ ముక్కల్ని విసిరి కొట్టింది. అవి కిటికీ గుండా బయటపడి గాలికి దిక్కుకొకటిగా ఎగిరి పోతున్నాం - ఇంతకన్నా నీవేం చేయగలగతావులే అని వెక్కిరించినట్టుగా.

ఆమె దృష్టి పడకమీదికి మళ్ళింది. ఇద్దరు పిల్లలు. తెల్లారిన దగ్గర్నించి అడుగు బయట పెట్టనీకుండా కట్టుదిట్టాల్లో ఉంచడం. వేళకింత బువ్వ పెట్టకపోవడం. ఏడ్చి ఏడ్చి అలానే సొమ్మసిల్లి పడి ఉన్నారు. వాళ్ల లోకం వాళ్లది. అంత బువ్వ. అంత నిద్ర. ఆ తర్వాత ఎవరే మవుతున్నారో? ఈ లోకం ఏమవుతూ ఉందో? ఎటు పోతూఉందో వాళ్లకవసరం లేదు. అవి పసి మనసులు.

కానీ తన మనస్సు ఎంత పట్టి పెట్టినా ఉండనంటూ ఉంది. అది సత్యాన్వేషణలో అవిశ్రాంతంగా అనుభవాల చుట్టూ గిరికీలు కొడ్తూ ఉంది.

అసలు తన బ్రతుకే ఒక దరిద్రపు బ్రతుకు.

కొందరు మట్టి పట్టితే బంగారమౌతుంది. తాను బంగారం పట్టినా మట్టే అయింది. ఎవరు దీనికి బాధ్యులు?

తన ఖర్మ!

ఆమె కాపరిస్థితిలో కూడా నవ్వు వచ్చింది.

చదువుకొనే రోజుల్లో అసలు తనకు కర్మ సిద్ధాంతం మీద నమ్మకంలేదు. మనసుల్ని ఎదగనివ్వకుండా కొందరు చెప్పు చేతల్లో వాదిగి ఉండడానికి స్వార్థ పరులు ప్రవేశపెట్టిన పిరికి మందు ఈసిద్ధాంతమని నమ్మింది. 'తన చేత తనరాత' అని వేదికలెక్కి ఉపన్యాసాలు దంచింది. మరి ఇప్పుడో? తనకు ఎదురైన పరిస్థితికి కారణాల్ని తెలివిగా కర్మ మీదికి నెట్టి ఊరటచెందాలనుకొంటూ ఉంది.

ఎంత చక్కటి ఆలోచన?

బహుశా కర్మసిద్ధాంతం బలహీనులకోసం తలుపులుతెరుచుకొని ఆహ్వానం పలుకుతూ ఎదురు చూస్తూ ఉంటుందేమో?

అయితే తనకు దాపురించిన ఈ పరిస్థితికి తానెంత వరకు బాధ్యురాలు?

ప్రేమలూ, దోమలని తానెప్పుడూ ఊహాలోకాల్లో విహరించలేదు. చదువుకోమ్మా అంటే చదివుకొనింది. 'ఆడపిల్లకీ మాత్రం చదువులు చాలమ్మా' అంటే సరే అనింది. 'తలవంచి తాళి కట్టించుకోమ్మా అంటే తలవంచి కట్టించుకొనింది. కాపురం చేయమంటే చేసింది. పనసతొనల్లాంటి ఇద్దరు పిల్లల్ని కనింది. మేమిద్దరం, మాకిద్దరు అని మురిసి పోయింది.

ఆ మురిసి పోవడం మిడిసిపాటుగానే మిగిలింది.

ఎవరో వెధవలు. వాళ్లను వెధవలనాలా? అమాయకులనాలా? అర్థం కాదు. పార్టీలు పెట్టేదొకరు. పేర్లు పెట్టేదొకరు. ఆ పార్టీలను పెంచేదొకరు. పెరిగిన పార్టీ పేరుమీద పేరూ, కీర్తుల్ని పెంచుకొంటున్నది కొందరు. ప్రయోజనాల్ని అనుభవిస్తున్నది మరి కొందరు. పార్టీల పేరు చెప్పుకొని కొట్లాడి చస్తున్నది దీనితో ఏమాత్రం సంబంధం లేని వాళ్లు. నిజంగా వాళ్లు అమాయకులే!

అమాయకుల్ని చేతుల్లో పెట్టుకొని నాయకులు ఆడిస్తున్నారు. వీళ్లు ఆడుతున్నారు. ఎందుకు ఆడరు? ముక్కుల దాకా తాగిస్తే?

ఒకరోజు మాటకు మాటగా మొదలయింది వాదులాట. ఆ వాదులాట కొట్లాటగా మారింది. సైకిల్ చైన్లు వీరవిహారం చేశాయి. సోడా బుడ్లు పగిలాయి. నాటుబాంబులు పేలాయి.

ఊరు ఉడికింది. ప్రతి మనిషి మనసు వణికింది. తారు రోడ్డు రక్తంతో తడిసింది.

అఫీస్ నుండి ఇంటికి వస్తున్నాడు భర్త. పరుల జోలికి వెళ్లే మనిషి కాదు. పార్టీలతో అసలు ప్రమేయం లేదు. ఇల్లేమో ఆఫీసేమోగా...తాను తన సంసారంగా...నోట్లో నాలుకలేని మనిషి. అయినా ఈ సంగతి నాటుబాంబుకేం తెలుసు? అదికూడా తాగినవాడి

చేతులోది. అది పిచ్చివాడి చేతులో రాయి. ఎటో విసిరితే ఎక్కడో పడింది.

తన తాడు తెంచింది.

అయ్యో పాపం అన్నారు. జరగరాని ఘోరం జరిగిందన్నారు. విధి నిర్దయుడన్నారు. మంచి వాళ్లకీ భూమిమీద చోటు లేదన్నారు. ఎవరేమంటే ఏముంది? చెరిగిన బొట్టును తిరిగి ఎవరైనా పెట్టగలరా? పెట్టుకొన్నా సహించగలరా?

ఈలోకంలో తప్పని సరిగా బతకాలి. ఎంత కాలం? కనీసం పిల్లలు తమ కాళ్లమీద తాము నిలబడే వరకు.

బతకడానికి ఏ ఇబ్బందీ లేదు. పెన్షన్ వస్తూ ఉంది. ఏ అలవాటూ లేని భర్త వెనకేసిన డబ్బు అంతో ఇంతో బ్యాంకులో ఉంది. ఆయన భాగానికి వచ్చిన భూముల్లో తిండి గింజలు వస్తున్నాయి. అయినా బతకనివ్వరే?...

ఏడాది తిరగలేదు. అప్పుడే వాలు చూపులు. వంకర నవ్వులు. వెక్కిరింపులు!

చూసీ చూడనట్టుగా...తనకేమీ పట్టనట్టుగా-ఎంత కాలమని భరించను? తోడులేని ఆడదాని జీవితం ఇంత దుర్భరమా? వద్దు బాబూ వద్దు...ఈ శాపగ్రస్త జీవితం ఎవ్వరికీ వద్దు. తన ఇల్లేమో తన పిల్లలేమో. ఈ లోకంలో తామరాకు మీది నీటిబొట్టులా వ్యవహరించాలనుకుంటే ఆ నీటి బొట్టును మళ్ళీ నీళ్లల్లో కలపడానికి ప్రయత్నాలు. ఆ ప్రయాత్నాల్ని ప్రతిఘటించి నిలబడడం దిన దిన గండం నూరేండ్లాయుస్సు!

సమాజమనే చెట్టుకు పూసిన అందమైన పువ్వు ఆడది. రక్షణ లేకపోతే ఎవ్వరైనా తుంచుకోవడానికి ప్రయత్నిస్తారు. అదో అటువంటి సమయంలోనే ఈ మనిషి తన జీవితంలో ప్రవేశించాడు.

దాదాపు ప్రతిరోజు స్కూటర్‌మీద ఇటు వెళ్లుతూనో, అటు వెళ్లుతూనో ఎప్పుడో ఒకప్పుడు తన యింటి ముందు, రోడ్డు కవతల టీ అంగళ్లవద్ద అతడు నిలబడతాడు. అతని రాకతో టీ అంగళ్ళ వద్ద వాతావరణమే మారి పోతుంది. కూర్చున్నవాళ్లు లేచి నిలబడతారు. నిలబడ్డవాళ్లు వొదిగి మరీ నమస్కరిస్తారు. కాలుతున్న బీడీలు, సిగరెట్లు కొన్ని కాళ్లకింద నలుగుతాయి. కొన్ని అరచేతి మరుగును ఆశ్రయిస్తాయి. అది భయంకావచ్చు. భక్తికావచ్చు. అభిమానంతో కూడిన ఆదరణ కావచ్చు. మొత్తానికి అక్కడ టీ అంగళ్ళు మొగాలకు అందాన్ని పులుముకొని పొడరద్దుకున్న మొగాల్లా మెరిసిపోతుంటాయి.

అక్కడ స్కూటర్ నిలబెడతాడు. దాని మీదే కూర్చుంటాడు. ఒక కాలు కింద, మరొక కాలు స్కూటర్‌మీద ఉంటాయి. మోడల్ కోసం నిలబడ్డ హీరోలా. అతడికి టీ యివ్వడానికి అంగళ్ళు పోటీపడతాయి. టీ అందుకుంటాడు. ఒక చేత టీ కప్పు. మరొక చేత సిగరెట్టు. చుట్టూ వున్నవాళ్లతో పలకరింపులు. అయితే చూపులు? అవి మాత్రం తన యింటివైపే!...తనమీదే!

మొదట మొదట చెప్పరాని అసహ్యం. ఏమిటి వీడూ? వీడి చూపులన్న కోపం.

దభీమని తలుపు మూసుకొని లోపలికి వెళ్ళిపోయేది.

అర్ధగంట. గంట...అపైన కాసేపు. వెళ్లిపోయి ఉంటాడులే అని తలుపు తీస్తే ఊహుఁ... మనిషి అక్కడనుండి కదలడే....ఆ చూపులు అటు యిటు కదలవే?

అసలు వీడు ఏమనుకుంటున్నాడు? ఏమిటి వీడి ఉద్దేశ్యం? అన్నట్లుగా ఒక్క చూపు చూస్తే చాలు. చూపు ఎటో మరలిపోతుంది. తల వాలిపోతుంది. బుద్ధిమంతుడైన పిల్లవాడిలా వంచిన తల ఎత్తకుండా స్కూటర్ స్టార్ట్ చేస్తాడు.

నెలలు గడిచాయి. అతని ప్రవర్తనలో మార్పులేదు. వచ్చిన మార్పంతా తనలోనే. చూస్తే చూసుకోనీలే, ఎవరు చూస్తే మాత్రం ఎందుకు భయపడాలి? చూసినంతసేపు చూస్తారు. చూసిచూసి కడకు వాళ్ళదారిన వాళ్ళు పోతారు. చూస్తున్నారని భయపడే కొద్దీ వొంగేకొద్దీ తొక్కే దెక్కువన్నట్లు భయపెట్టేది ఎక్కువవుతుంది.

కొన్ని నెలలు అనుభవం నేర్పిన పాఠం.

ఇప్పుడు తలుపు మూయడం లేదు. తనవైపు చూస్తున్నాడన్న సందేహంతో లోపలికి వెళ్ళి పోవడం లేదు.

ఈ మార్పు అతని చూపుల్లో మార్పు తెచ్చింది.

అబ్బ...ఆ చూపుల్లో ఎంత అభ్యర్థన? అది గ్రహించిన వాళ్ళకే అర్థమవుతుంది. అర్థమైనపుడు ఆడదాని ప్రవర్తన అర్థరహితంగామారుతుంది. అదే బలహీనత. ఆ బలహీనతే ఆడదానికొక శాపం.

చూపుల్లో చూపులు కలిశాయి!

ఆ మొగంలో ప్రసన్నత ఆ కన్నుల్లో అమాయకత ఆకట్టుకొన్నాయి.

రెప్పార్చకుండా అతడు చూస్తున్నాడు. చూసీ చూడనట్టు తానూ చూస్తూ ఉంది. చూపులు మాట్లాడుకొంటున్నాయి.

ఆ అనుభవం కొత్తగా ఉంది. ఆ అనుభూతి తియ్యగా ఉంది. కాలం గడిచినట్టే తెలియడం లేదు. అయినా కొంతకాలం గడిచిపోయింది.

ఉన్నట్టుండి అతడు ఒక వారందినాలు మాయమయ్యాడు. ఆ వారందినాల్లో తనేమిటో తనకు బాగా అర్థమయింది. ఆ చూపుల బాణాలు సూటిగా గుండెల్ని తాకుతున్నాయి. వేధిస్తున్నాయి. వదిలించుకొందామని ప్రయత్నించే కొద్దీ వదలకుండా అలజడి పెడుతున్నాయి. 'ఛీ ఛీ...ఏమిటీ బలహీనత?' అని వందసార్లు కాదు వెయ్యి సార్లు తన్నుతాను ప్రశ్నించుకొనింది. ఎన్నిసార్లు ప్రశ్నించుకొన్నా ఏముంది? ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోతూ ఉంది. ఆశ్చర్యం!...తనకు తెలియని ఒక ఆత్మీయతా స్పర్శ లాగితే వీధి గుమ్మం వద్ద నిలబడుతుంది. చూడకూడదనుకొంటూనే టీ అంగళ్ళవైపు చూస్తుంది.

ఊహ తెలిసీ తెలియని రోజులు. ఊహాలోకాల్ని గురించి ఊహలే లేనిరోజులు. ఒక వ్యక్తితో కలిసి జీవించమన్నారు. జీవించింది. చూపుల కింత అవ్యక్తమైన శక్తి ఉందని

అప్పుడు తెలియదు. ఇప్పుడు తెలుస్తూ ఉంది.

తెలిస్తే లోకం చూపులు. అవి రకరకాల చూపులే! వాటిని భరించడానికి వీలవుతుందా? కాదు. కానపుడేం చేయాలి? హద్దులు దాటుతున్న మనసును అదుపులో పెట్టుకోవాలి. తన హద్దు గడపకివతలే అని తెలుసుకోవాలి.

అదే మగవాడికైతే? రంగురంగుల దుస్తుల్లో దాని రూపానికి ఏ సమస్యా ఉత్పన్నం కాదు. ఏమి లోకమో? మగవాడి కొకన్యాయం. ఆడదానికొక న్యాయం.

ఆలోచిస్తూ వీధి గుమ్మంలో నిలబడి ఉంది. ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ ఉన్నట్టుండి స్కూటర్ ఆగింది. టీ అంగళ్ళ ముందు ఆగవలసిన స్కూటర్ తన ఇంటి ముందు ఆగింది. స్కూటర్ మీద అతడు తనవైపే చూస్తూ...చిరునవ్వు నవ్వుతూ!

గుండె దడ దడలాడింది. తలుపు దఢీమని మూసి లోనికి వెళ్ళాలనుకొంది. వెళ్ళలేక బొమ్మలా నిలబడిపోయింది.

"కాసిని మంచి నీళ్ళిప్పిస్తారా?"

ఎంత ఇంపుగా ఉంది ఆ మాట! ఎంత వినయం ఉట్టిపడుతూ ఉంది ఆమాటలో - మారు మాట్లాడకుండా తెచ్చి యిచ్చింది.

చాలాదూరం ప్రయాణం చేసినట్టుంది. ఒక్క గుక్కలో చెంబుడు నీళ్ళు ఖాళీ చేశాడు.

"ఇంట్లో ఫ్రిజ్ లేదా?"

చెంబు చేతికిస్తూ అడిగాడు.

చివుక్కు మనింది మనస్సు.

"ఏం నీళ్లు చల్లగా లేవా?"

"లేవని కాదు...ఫ్రిజ్‌లో అయితే మరింత చల్లగా ఉండేవి"

"లేని వాళ్ళకు మట్టి కుండలే ఫ్రిజ్‌లు."

"హుఁ! ఉన్నవాళ్ళు. లేనివాళ్ళు. ఈ వ్యవస్థలో ఎవరున్న వాళ్ళు? ఎవరు లేనివాళ్ళు? ఉండవలసింది మనస్సు. ఆ మనస్సే ఉంటే ఈ లోకంలో లేనివాళ్ళే ఉండరు"

నిరుత్తరంగా చూస్తూ నిలబడితే స్కూటర్ స్టార్ట్ చేసి వెళ్ళిపోయాడు.

అంత గొప్ప వేదాంతం మట్లాడిన మనిషేనా ఇంత దుర్మార్గానికి తల పెట్టింది. దుర్మార్గమంటే? అది స్వల్పమైన దుర్మార్గమా? కాదే? నిద్రపోతున్న వాళ్ళ మీద పడి చంపడం. ఒక్కరా? యిద్దరా? ముగ్గురు! ముగ్గురి ప్రాణాల్ని బలికొనడమంటే అదెంత కసాయిగుండె? నమ్మశక్యం కావడంలేదే?...

ఎవరో తలుపు తట్టిన శబ్దం.

ఆమె ఉలిక్కిపడి లేచింది.

అతనిని వెదుక్కొంటూ వచ్చిన పోలీసులు కాదుకదా? ఒక్క క్షణం గుండె ఆగినంత పని అయింది. అయినా నిబ్బరించుకొనింది. అడుగుమీద అడుగ్గా తలుపు దగ్గరికి నడిచింది.

తలుపు తీయడానికి ధైర్యం చాలడంలేదు. కిటికీ దగ్గరికి నడిచింది. మెల్లగా కిటికీ తలుపు కొద్దిగా తెరిచి చూసింది.. ఎవ్వరూ లేరు.

అంతా తన భ్రమ.

హమ్మయ్య! అనుకొంటూ గుండెల నిండుకు గాలి పీల్చుకొనింది. తలుపు తీసింది. బాగా చీకటిపడింది. వీధి దీపాలు తరుముతుంటే చీకట్లు పరుగెత్తినట్లు పరుగెత్తి ఒక చోట తిరగబడి 'ఇక తరమండి చూద్దాం' అంటూ పంతాలు పోతున్నాయి. కారో లారీయో తొక్కిపోతే టీ అంగళ్ళ ముందు పడి ఒక కుక్క 'కుయ్యో కయ్యో' మని అరుస్తూ ఉంది. దానిగోడు పట్టించుకున్న నాథుడే లేదు. 'ఈ లోకంలో ఎవరిగోడు వాళ్ళది' అనుకొంటూ ఆమె తలుపు మూసింది. గడిపెట్టింది. లోపలికి నడిచింది.

పిల్లలు లేచి కూర్చున్నారు. తనవైపు భయం భయంగా చూస్తున్నారు.

హుఁ! తనకంటే బాధ. ఆ బాధలో ఆకలి దప్పులు తెలియడంలేదు. అదే పిల్లలు? ఎప్పుడో ఉదయాన పెట్టిన అంత టిఫిను. పైగా జైలు శిక్ష.

కన్నీళ్లు నింపుకొన్న కారుమేఘమే అయింది గుండె!

ఆమె వంట ప్రయత్నంలో పడింది. చేతులు కాళ్ళు చెప్పినట్టు వింటున్నాయి. వంటపని చక చక సాగిపోతూ ఉంది. మనస్సు? దాని దారి దానిదిగానే ఉంది!

'ఉన్నవాళ్ళెవరు? లేని వాళ్ళెవరు? ఉండవలసింది మనస్సు. మనస్సుంటే ఈ లోకంలో లేనివాళ్లే ఉండరు' అని వేదాంతం వల్లించి ఒక వాయు తరంగంలా వెళ్లిపోయిన మనిషి. మళ్ళీ అయిదారు రోజుల వరకు అయిపులేడు.

అదే ఆలోచిస్తూఉంటే ఒకరోజు ఉన్నట్లుండి యింటిముందు ఒక వ్యాన్ నిలబడింది. అందులో నుండి గబగబ అయిదారు మంది దిగారు. దిగి ఫ్రిజ్ దింపుకొన్నారు. సరాసరి తెచ్చి యింట్లో పెట్టారు. "ఎవరు మీరు? ఏమిటిది? ఎవరడిగారు? ఎవరు పంపించారు? నాకెందుకీ ఫ్రిజ్? తీసుకెళ్ళండి!" అని అరుస్తున్నా వాళ్ళ చెవుల్లో సీసం పోసినట్లుంది. మరబొమ్మల్లా మాటా పలుకూ లేకుండా ...అసలు తన మాటలతో కానీ తనతో కానీ నిమిత్తమే లేనట్లుగా...ఫ్రిజ్ పనిచేయడానికి చేయవలసిన పనులన్నీ చకచకా చేశారు. వెళ్ళిపోయారు.

ఆ తర్వాత ఒకరోజు సోఫా వచ్చింది. మరొక రోజు కలర్ టీవీ వచ్చింది. ఒకదాని తర్వాత ఒకటిగా వద్దు మొర్రో అని మొత్తుకొంటూన్నా వస్తున్నాయి. ఏదో చేయాలనితపన. ఏమీ చేయలేని నిస్సహాయత. కాదు బలహీనత.

అయినా అతను కనిపిస్తే?...

ఇదేమన్నా బాగుందా? వెనకా ముందు ఎవ్వరూలేని ఆడదాన్నే కావచ్చు. ఏమిటీ దౌర్జన్యం? నలుగురూ ఏమనుకుంటారు? ఇంత బరితెగించడం బాగలేదు? అని కడిగేయాలనుకొనింది. ఇంతకూ అతడు కనిపిస్తే గదా!

ఆ లోపుగానే లోకం అది తన బాధ్యత అన్నట్టుగా ముద్రవేసి మురిసిపోతూ ఉంది.

ఒక్కొక్క వస్తువు వచ్చి యిల్లు చేరినట్లుగానే అతనూ ఒకరోజు ఇల్లు చేరాడు. వస్తువుల్ని ప్రతిఘటించలేక పోయినా అతడు కంట పడేసరికి అంతవరకు కడుపులో దాచుకున్న అక్కసు అంతా కక్కేసింది.

అతడు ఉలకలేదు. పలకలేదు.

"చదువు కొన్నదాన్ని. అంతో ఇంతో ఇంగిత జ్ఞానం ఉంది. అందుకే మీ మనుషుల్ని అగౌరవ పరచలేక పోయాను. మీ వస్తువుల్ని తీసుకొని మీరు బయటికి నడిస్తే యిద్దరికీ మంచిది"

కచ్చితంగా మాట్లాడింది.

"నాకు ఎప్పుడో పెళ్ళి అయింది. పిల్లలున్నారు. కావలసినంత ఆస్థి పాస్తులున్నాయి. పెళ్లి అయిందంటే అదొక బొమ్మల పెళ్ళిలా జరిగిపోయింది. ఏది కావాలో ఏది వద్దో తెలియని పసి వయసుల్లో. అది తల్లిదండ్రుల ముచ్చట. తాళికట్టరా అన్నారు. కట్టాను. కాపురం చేస్తున్నాను. ఏలోటు లేకపోయినా ఏదో ఊహకందని వెలితి. ఆ వెలితి ఏదో తెలియదు. పోనీ కావలసిందేదో అర్థం కావడంలేదు. ఈద్వైదీ భావనలోనే బతికాను. బతుకుతున్నాను. నిన్ను చూసిన తర్వాత నాకు కావలసిందేదో తెలిసింది. నన్ను కాదనకు."

అతని కంఠం రుద్ధమయింది.

మనస్సు పొరల్లో ఎక్కడో లవలేశమంత సానుభూతి.

"అయితే ఆమెకు జరిగే అన్యాయం?"

"తానొక కన్ను. నువ్వొక కన్ను. ఏ కంటికి బాధకలిగినా ఆ బాధనాది."

"హుం!...మాటలకేం? మగరాయుళ్ళు తుమ్మెదలు. కమ్మ కమ్మగా కబుర్లు చెబుతారు. కార్యసాధన వాళ్ళ ధ్యేయం. అందమైన పూవు కంటపడితే చాలు, వాలాలనుకోవడమే!"

"ఎప్పుడైనా సరే...నా నడవడిలో తప్పెత్తి చూపగలిగితే? వేసే శిక్షకు బద్ధుణ్ణి."

కాసేపు ఆలోచించింది. ఒక నిర్ణయానికి వచ్చింది.

"తాళి కట్టండి. అదే వేస్తున్న శిక్ష!" అనింది.

"మాహద్భాగ్యం. అది శిక్ష కాదు. ఇద్దరికీ రక్ష" అన్నాడు.

అన్నంత పని చేశాడు.

లోకం ఏమనుకొంటుందో? అని భయపడింది. అయితే లోకమే భయపడింది. ఇప్పుడు వాలు చూపులు వంకరనవ్వులు వెక్కిరింపులు తోకముడుచుకొన్నాయి.

జీవితానికి తగిన రక్షణ దొరికిందని ఆనంద పడింది.

ఆ ఆనందం కూడా తన దురదృష్టం కాకపోతే ఇంత తొందరగా మట్టి కొట్టుకొని పోతుందా?

ఆనందం సంగతి దేవుడెరుగు! అనుక్షణం గుండెలు అరచేతిలో పెట్టుకొని బ్రతకడమంటే మాటలా?

ఒకరి మొహం ఒకరు చూసుకొంటూ బిక్కుబిక్కుమని కూర్చున్న పిల్లలు. తూగి తూగి పడుతూ అలానే పడి నిద్ర పోయారు. వాళ్లను లేపింది. అన్నం తినిపించింది. పడుకోబెట్టింది. అన్నం ముందు కూర్చుంది. ఊహుఁ!ముద్ద దిగనంటుందే? అయినా తప్పదు. అంత ఎంగిలి పడింది. వెళ్ళి పిల్లల పక్కన పడుకొనింది.

కంటిమీద రెప్ప పడనంటూ ఉంది. టీ అంగళ్ళ ముందు కారో లారీయో కింద పడినకుక్క. దాని ఏడుపులు మూలుగులుగా మారాయి. ఇప్పుడో ఇక కాసేపటికో దాని బతుకు తెల్లారిపోతుంది. ఎవరో ఈడ్చి అవతల పారేస్తారు. ఎవరి బతుకైనా అంతేగదా? ఈ సంగతి అందరికీ తెలుసు. తెలిసి తెలిసి మనిషి ఎందుకిలా ప్రవర్తిస్తాడు. బహుశా ఆ విధంగా ప్రవర్తించినపుడే మనిషి అనిపించుకుంటాడేమో?

రోడ్డుమీద పోటీలు పడుతున్న కార్లు లారీలతో ఆలోచనలు పోటీపడుతున్నాయి.

పిల్లలు ఆదమరిచి నిద్రపోతున్నారు. నిజంగా వాళ్లే దేవుళ్లు. మనిషి జీవితంలో కల్లాకపటం ఎరగని ఆ వయసు ఒక వరం. ఎంత ప్రయత్నించినా మళ్ళీ పొందలేని వరం.

కనురెప్పలు బరువెక్కాయి. కళ్లు మండుతున్నాయి. కళ్ళు మూసుకొనింది. మళ్ళీ తెరిచింది. కళ్లు మూసుకున్నా తెరుచుకున్నా అతడి రూపమే. అతడి మాటలే!...మనసును చీకాకు పరుస్తున్నాయి.

ఛీ! ఛీ! ...ఎవరికీ తనవల్ల కించిత్ ద్రోహం జరగదన్న మనిషి ఇంత విద్రోహానికి పాలుపడతాడా?

అయినా గోటితో పొయ్యే పనికి గొడ్డలి తీసుకున్న వ్యవహారం కదా ఇది?

కేవలం పది సెంట్ల ఖాళీస్థలం. అది కూడా గ్రామ పోరంబోకు. అతడి అధీనంలోనే ఉండచ్చుగాక. ఆ స్థలం కావాలనింది ఎవరు? గ్రామస్థులు. ఎందుకు? బడి కట్టడానికో. గుడి కట్టడానికో. సరేనంటే తీరిపొయ్యేది. ఆ మాత్రానికే కొంపలంటుకు పోయొయ్యేది లేదు కదా? ఇవ్వనంటే ఇవ్వనన్నాడట. గ్రామస్థులు ఇచ్చి తీరాలన్నారట. పట్టింపులకు పోయారు. పంతాలకు దిగారు. రక్త తర్పణం చేశారు. అది సృష్టించిన మారణ కాండ తలుచుకుంటే వొళ్ళు గుగుర్పొడుస్తూ ఉంది.

తాను చిన్నప్పుడు చదువుకొన్న మధుబిందు న్యాయం కేవలం కథనుకొనింది. అది కథ కాదనీ ఇటువంటి అనుభవంలోనుండి పుట్టిందేనని ఇప్పుడు తెలిసింది. ఎవడో తేనె తీసుకొని పోతున్నాడట. నాలుగు చుక్కలు నేల రాలాయి. వాటి మీద ఈగలు వాలాయి. ఆ ఈగల కోసం ఒక బల్లి వచ్చింది. ఆ బల్లి కోసం ఒక పిల్లి వచ్చింది. పిల్లిని చూసి కుక్క వచ్చింది. కుక్క పిల్లి కాట్లాడుకొన్నాయి. కుక్క పిల్లిని కరిచింది. పిల్లి గల వాళ్లు కుక్కను కొట్టారు. కుక్క గల వాళ్ళు పిల్లి గల వాళ్ల మీద పడ్డారు. తేనె చిందిన చోట రక్తం కరుడు గట్టింది.

ఇప్పుడు జరిగింది కూడా అంతే!

పది సెంట్ల గ్రామ పోరంబోకు. అతడు ఇవ్వనన్నాడు. ఊళ్లో వాళ్లు కావాలన్నారు.

చిలికి చిలికి గాలి వానయినట్టుగా మాటా మాటా పెరిగి కొట్లాటగా మారింది. అతని మీద దెబ్బ పడింది.

అది ఉన్నవాడి మీద పడిన దెబ్బ ! ఊరుకోనిస్తుందా? ఉండాలనుకున్నా డబ్బు ఉండనిస్తుందా? తిరగని ఊరూ నాడూ లేదంటూ తిరిగాడట. ప్రాణాలకైనా తెగించగల ముప్పయిమంది రౌడీలను కిరాయికి కొన్నాడు. ఒకరోజు అర్ధరాత్రి అందర్నీ లారీలో తెచ్చి ఊరిమీద వదిలాడట.

రౌడీ మూక నిద్ర పోతున్న ఊరి మీద పడింది.

చేతికి దొరికిన వాళ్లను దొరికినట్లుగా చితక గొట్టింది.

ఊరు మేల్కొనింది.

ఇరు పక్షాలు కలపడ్డాయి. దొమ్మికి సిద్ధంగా వొళ్లు తెలియని స్థితిలో వొచ్చిన వాళ్లతో నిద్ర కళ్లతో ఉన్న ఊరు తలపడటం! ఊళ్లో మూడు తలలు ఎగిరి పడ్డాయి.

రౌడీ మూక పలాయనం చిత్తగించింది.

ఊరు ఉడికింది. ఉవ్వెత్తుగా లేచింది. అతడి కొంప మీద పడింది. పొలాలమీద పడింది. తోటల మీద పడింది. ధ్వంసం చేసింది.

పది సెంట్ల పోరంబోకు నేలకు పరిహారం లక్షల ఆస్తి నష్టం!

అక్కడకీ చల్లారక గ్రామస్థులు అతని కోసం వెదుకుతున్నారట. పోలీసులు గాలిస్తున్నారట.

ఊరుకాని ఊరని...ఉనికి తెలియదని...తలదాచుకోవడానికి అతడు ఏ క్షణాన్నయినా రావచ్చు. అతన్ని వెతుక్కొంటూ తన ఇంటికి గ్రామస్థులు రావచ్చు. పోలీసులు రావచ్చు. ఏం చేయాలి?

అవునంటే ఒక బాధ. కాదంటే మరొక బాధ. అయినా తాళికట్టి రక్షణ కల్పించిన మనిషి. ఆ మనిషే రక్షణ కోరితే?

హు! సూర్య చంద్రుల సాక్షిగా, ముక్కోటి దేవతల సాక్షిగా, భూదేవి సాక్షిగా, ఆకాశవాణి సాక్షిగా అంటారు...పదిమంది పెద్దల ముందే కడతారు. ఆ తాళ్లే విడాకుల పాలవుతుంటే తనకు కట్టిన తాళికి ఎవరు సాక్షి?

ఊరు బాగు కోరని మనిషి ఇంకొక ఇంటి బాగు కోరతాడా?

ఎవరో మెల్లగా తలుపు తడుతున్న చప్పుడు.

ఆమె ఉలిక్కి పడింది. ఆలోచన తెగిపోయింది. మనస్సు గతం నుండి బయటపడి ప్రస్తుతంలో అడుగు పెట్టింది!

"కొంపదీసి ఆ మనిషే వచ్చాడా?...వచ్చినా రావచ్చు. ఇది తన ఇల్లు అన్న ధీమాతో రావచ్చు. వస్తే ఏం చేయాలి?"మనసు డోలాయమానంలో పడి తలుపు సందులో ఇరుక్కున్న వేలులా నలుగుతూ ఉంది. తలుపు తీస్తే ఒక బాధ. తీయకుండా పోతే వేలు నలిగిపోతున్న బాధ!!ఎటూ తోచకుండా...మనస్సును దిటవు చేసుకొని ఉండలేకుండా

మెల్లగా పైకి లేచింది. అడుగు మీద అడుగ్గా చప్పుడు కాకుండా తలుపు దగ్గరికి నడిచింది. తలుపు ప్రక్కన్నే కిటికీ. ఆ కిటికీ తలుపు కొద్దిగా తెరిచి చూసింది. 'హమ్మయ్య అని నిట్టూర్చింది!

తలుపు తడుతున్నది దుర్గడు.

ఆమె కిటికీ తలుపు మూసింది. తలుపు గడి తీసింది. కొద్దిగా తెరచింది. ముఖాన్ని బయటపెట్టడానికి ధైర్యం చాలక ద్వార బంధానికి ఇటువైపే నిలబడి-

"ఏమి దుర్గయ్యా!...ఈ వేళప్పుడు తలుపు తడుతున్నావే?"అని అడిగింది.

"నా బతుకు తెల్సిందే గదమ్మా! దోవనపోతా ఉండే పని ఎత్తి నెత్తినేసుకోని శానా దూరాబారాన్నుంచి వస్తా ఉండానమ్మా. నాలిక పిడ్సగట్టక పోతా ఉండాది. చల్లంగా రొన్ని మంచి నీళ్లు తాగదామని..."అప్పుడప్పుడు వచ్చి చల్లగా ఫ్రిజ్‌లోనీళ్లు తాగిపోవడం వాడికి అలవాటే. అందుకే మారు మాట్లాడకుండా ఫ్రిజ్ దగ్గరికి నడిచింది. అయితే ఆ పరిస్థితిలో దాన్ని తాకాలంటే కూడా అసహ్యం వేసింది. అయినా తప్పలేదు. నీళ్లు తెచ్చింది. దుర్గడు వొంగి రెండు అరచేతులు చేర్చి నోటి దగ్గర దోసిలి పట్టాడు. తెచ్చిన నీళ్లు వాడి దోసిట్లో పోసింది. దప్పిక తీరేదాకా తాగాడు. 'ఇంక చాలమ్మా! చాలు!' అన్నట్లుగా తలతోనే సైగ చేశాడు. దోసిట్లో నీళ్లు పోయడం నిలిపింది.

"నూరేండ్లు చల్లంగా బతుకు తల్లీ" అంటూ చేతులు జోడించి బెట్ట పడ్డ ముఖాన్ని చల్లని అరచేతులతో రుద్దుకుంటూ దుర్గడు బయలుదేరాడు.

వాడినే చూస్తూ నిలబడింది.

తిరిగి మళ్లీ చూడకుండా వాడు పోతూనే ఉన్నాడు.

అలా వాడివైపే చూస్తూ నిలబడితే జ్ఞాపకాలు సజీవ మూర్తులుగా కండ్లముందు నిలబడ్డాయి.

ఇది జరిగి ఇంకా నెలలు తిరగలేదు. ఆ ఊళ్లో రెడ్డి కొడుకు. వాడలో ఒక హరిజనుడు. ఇద్దరు మంచి ప్రాయం మీద ఉన్నారు. ఒక దినం ఒకరికెదురుగా ఒకరు ఒకే గనిమ మీద నడుస్తున్నారు.

"మాలనాకొడుకు తొలగతాడులే?" అని రెడ్డి కొడుకు ధీమా.

"ఏం వీళ్లను చూసి ఎల్లకాలం మేమే తొలగాల్నా? రెడ్డి కొడుకైతే మాత్రం రొండు కొమ్ములేమైనా మొల్సినాయా? ఆయన నా మాదిర మణిసే గదా?" అని హరిజన యువకుడి అభిప్రాయం.

ఒకరికొకరు తీసిపోని ధీమాతో పట్టుదల. పట్టుదలతో పౌరుషం. మంచి ముంపు మీద నడుస్తున్నారు. ఒకరికొకరు దగ్గరౌతున్నకొద్దీ పౌరుషాలు పెరుగుతున్నాయే కానీ సడలడం లేదు. ఆ ముంపులో ఇద్దరూ మంచి పరువం మీదున్న పోట్ల గిత్తల్లా ఢీకొన్నారు. అటొకరు ఇటొకరుగా మడి కయ్యల్లో పడ్డారు.

ఫలితంగా రచ్చబండ వద్ద మద్దిస్తం.

"మాలనా కొడకలకు కండ్లు నెత్తి కెక్కిపోతా ఉండాయి. అయినా అడక్కతినే నా కొడకలకు అంత పెగ్గె పనికి రాదు. ఎదురుంగా వస్తా వుండేది రెడ్డి కొడుకు. పైగెనిమకు కింది గెనిమకు వెత్తాసం తెలుసుకోని గదా ఎవుడైనా బతకాల. అట్టా తొలిగుంటే వాడెబ్బ గంటేమైనా పోతిందా? కడితే రొండువేల తప్పు కట్టండి. లేకుండాబోతే మీరెవురూ మాకు కూలికి రావాల్సిన పనేలేదు."

ఊరి న్యాయం తీర్మానించింది.

ఆ తీర్మానానికి తిరుగులేదు!

ఏది ఏమైనా తప్పు కట్టేది లేదని వాడలో యువత ఎదురు తిరిగింది. 'ఎట్లా కట్టరో చూస్తాం' అంటూ ఊరు మీసం మెలేసింది.

అప్పుడు ఇరువర్గాలకు రాజీకుదర్చడానికి దుర్గడు పడినపాట్లు? ఏనోట విందామన్నా వాడి మాటే గదా? వాడే పూనుకోకుంటే ఎన్ని ఇండ్లు తగలబడేవో? ఎంత రక్తపాతం జరిగేదో? కొంప గోడు వొదిలిపెట్టి కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చేదో?...

ఇలా ఒక్కటికాదు వాడు చేసిన మంచి పనులు వంద చెప్పుకోవచ్చు.

వాడు ఊరికి ఉపకారి!

వాడు తాగడానికి నీళ్లడిగితే? ఇచ్చాను. ఎలా? చెంబు ఎత్త గలిగినంత పైకెత్తి దోసిట్లో పోశాను.

వాడు అంటరానివాడా?

మనిషి ఎంత స్వార్థుడు??

స్వార్థం...దాని స్వరూప స్వభావాల పరిణామాలే ఊహాతీతం.

మనిషి..సాటి మనిషి హక్కుల్ని హరించి దూరంగా ఉంచి అంటరానివాడని ఎప్పుడు ముద్ర వేశాడో అప్పుడే స్వార్థానికి అంకురార్పణ జరిగింది.

అయితే నిజంగా వాళ్లా అంటరానివాళ్లు?

కాదు...కానే కాదు!

పదిమందికి జరుగుతున్న మంచికి అడ్డు తగిలే వాళ్లు...ప్రగతి నిరోధకులు...విద్రోహ చర్యలకు, విధ్వంస కాండలకు పాదులు కట్టే ప్రబుద్ధులు...సాంఘిక దురాచారాలకు చలువ పందిళ్లు వేసే తులవలు వీళ్లు అంటరాని వాళ్లు!

ఈ కోవలో పయనిస్తూ ఉంటే వాడు తాళి గట్టిన వాడైనా సరే తనయుడైనా సరే వాడూ అంటరానివాడే!

అప్రయత్నంగా గుండెల్లో గుదిబండలా వేలాడే తాళిని పట్టుకున్న చేతులు ఆలోచనలను తెగనరికేస్తూ పిడికిలి బిగించాయి గట్టి నిర్ణయంతో!

ఆమె గుండెల్లో బరువు చల్లగా దిగి పోయింది.

లోకంలో ఉన్న నిద్రంతా తన్నావహించి నన్నట్లు ఆమె నిశ్చింతగా నిద్రలోకి జారుకొనింది!●

*-విపుల (జనవరి 1991)*